క్లుప్తంగా

కేంద్ర మంత్రికి సత్కారం



మంత్రిని సన్మానిస్తున్న బీజేపీ నేతలు

నర్సాపూర్: కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను బుధవారం పలువురు బీజేపీ నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గ మాజీ కన్వీనర్ మల్లేశ్‌గౌడ్, బీజేవైఎం నాయకుడు అరవింద్‌గౌడ్‌తో పాటు పలువురు నాయకులు ఆయనను ఢిల్లీలో కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

పనుల్లో రాజీపడొద్దు



పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి నుంచి శాలిపేట వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులను జెడ్పీటీసీ కృష్ణారెడ్డి పరిశీలించారు. బుధవారం పనులను పరిశీలించి నాణ్యతలో రాజీపడొద్దని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం మాట్లాడుతూ రూ.17లక్షల నిధులు మంజూరు అయ్యాయని, పనులు చేపట్టడంలో కొంత ఆలస్యం జరిగిందన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇటీవల నిర్వహించిన సమీక్షలో ఈ పనుల గురించి ప్రస్తావించామని చెప్పారు. ఆయన వెంట బీజేపీ నాయకులు కృష్ణారెడ్డి, నరేశ్ తదితరులు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలంటూ వినతి



వినతిపత్రం అందజేస్తున్న యువకులు

మనోహరాబాద్(తూప్రాన్): స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని పలువురు యువకులు హెచ్‌ఎం రెహాన సుల్తానాకు బుధవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ భోజనం సరిగా లేకపోవడంతో విద్యార్థులు తినడంలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనిల్, గణేశ్ యాదవ్, మణివర్ధన్ ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే రుణమాఫీ సాధ్యం



జలీల్

అల్లాదుర్గం(మెదక్): రైతుల రుణమాఫీ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని యూత్ కాంగ్రెస్ నాయకుడు షేక్ జలీల్ పేర్కొన్నారు. బుధవారం అల్లాదుర్గంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఆగస్టులో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని చెప్పారు. మతాలను రెచ్చగొడుతూ బీజేపీ రాజకీయ లబ్ధి పొందుతోందని ఆరోపించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని మెల్లూర్ గ్రామశివారులోని హల్దీ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ నవత పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ఇసుక తలించినందుకు సంబంధిత వాహన యజమాని నరేందర్‌పై కేసు నమోదు చేశామని చెప్పారు. ముందస్తు అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాబును వదిలేశారు..



చేగుంట(తూప్రాన్): రైలులో 15నెలల బాబును గుర్తు తెలియని వ్యక్తులు వదిలేసిన ఘటన వడియారం రైల్వే స్టేషన్‌లో బుధవారం చోటు చేసుకుంది. కామారెడ్డి రైల్వే ఎస్‌ఐ తావునాయక్ కథనం ప్రకారం.. కాచిగూడ నుండి మెదక్ వస్తున్న ప్యాసింజర్ రైలు వడియారం స్టేషన్‌లో ఆగినప్పుడు గుర్తు తెలియని వ్యక్తులు బాబును వదిలేసి దిగేశారు. దీంతో తోటి ప్రయాణీకులు ఒంటరిగా ఉన్న ఆ బాబును గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే ఎస్‌ఐ తావునాయక్ విచారణ జరిపి ఆ బాబును మెదక్‌లోని బాలల సంరక్షణ కేంద్రంలో అప్పగించారు. సమాచారం తెలిసినవారు రైల్వే పోలీస్‌లను సంప్రదించాలని ఆయన కోరారు.

మూతపడి.. మూగబోయి

నిత్యం తాళంవేసే దర్శనం

- కానరాని అధికార యంత్రాంగం
- కరువైన కనీస సౌకర్యాలు

గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన రైతువేదికలు నిత్యం తాళంవేసి ఉంటున్నాయి. గ్రామశివారులో నిర్మించిన ఈ వేదికల్లో కనీస సౌకర్యాలు కల్పించలేదు. దీంతో క్లస్టర్ ఏఈఓలు కూడా విధులు చేపట్టేందుకు ఆసక్తి చూపడంలేదు. ఏఈఓలు ఫీల్డ్ విజిట్ పేరిట రాకపోవడంతో రైతువేదికలు ఎప్పుడు చూసినా తాళాలువేసే కనిపిస్తున్నాయి. దీంతో రైతులు నిరాశతో వెనుదిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

– నర్సాపూర్ రూరల్



తాళంవేసి ఉన్న రెడ్డిపల్లి రైతువేదిక

- రెడ్డిపల్లిలోని రైతు వేదిక నిర్వహణ లోపంతో చెత్తాచెదారంతో అధ్వానంగా తయారైంది. పనుల్లో నాణ్యత లేకపోవడంతో పగుళ్లు ఏర్పడ్డాయి. వేదిక చుట్టూ ఉన్న టైల్స్ కూడా ఊడిపోయాయి.
- వేదికల్లో మరుగుదొడ్లు నిర్మించకపోవడంతో మహిళా ఏఈఓలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్రహీంబాద్ రైతు వేదికలో మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి సౌకర్యం కల్పించలేదు. అలాగే కొన్ని పనులు అసంపూర్తిగానే వదిలేశారు.
- రైతు వేదికలు గ్రామశివారులో ఉండటంతో మందు బాబులకు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా మారాయి. ప్రతిరోజూ రాత్రి వేళ మందుబాబులు మద్యం తాగి సీసాలను అక్కడే పడేస్తున్నారు.
- వ్యవసాయరంగంలో ఆధునిక పద్ధతులపై రైతులకు శిక్షణ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, అప్పుడప్పుడు రైతు సమావేశాలు నిర్వహించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు.
- ప్రత్యామ్నాయ పంటల సాగుపై మొక్కుబడిగా సమావేశాలను నిర్వహిస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.
- భూసార పరీక్షలు చేసేందుకు ప్రత్యేకమైన ల్యాబ్‌లు ఏర్పాటుచేసి కిట్లు ఇచ్చినప్పటికీ కెమికల్ సరఫరాలేక పరీక్షలు నిర్వహించడం లేదు.
- నర్సాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికను ఆయా అవసరాలకు వాడుకుంటున్నారు. స్థానికంగా ఏడీఏ కార్యాలయం ఉన్నందున ఇక్కడి రైతువేదిక మాత్రం పూర్తిస్థాయిలో వినియోగంలో ఉంది.



పగుళ్లు ఏర్పడి దెబ్బతిన్న టైల్స్

మండలంలోని 34 పంచాయతీలతోపాటు 50వరకు ఉన్న గిరిజన తండాలను కలుపుకొని ఐదు క్లస్టర్లుగా విభజించారు. నర్సాపూర్, లింగాపూర్, రెడ్డిపల్లి, ఇబ్రహీంబాద్, అవంచ క్లస్టర్ గ్రామాలుగా గుర్తించి గత ఏడాది మొదట్లో రైతు వేదికలను నిర్మించారు. ఒక్కొక్క వేదికకు జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.22లక్షలు మంజూరుచేసి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించి గత ప్రభుత్వ పాలకులు హడావుడిగా పూర్తి చేయించి ప్రారంభించారు.

కనీస వసతులు కల్పించాలి



రైతువేదికల్లో విద్యుత్, టాయ్‌లెట్లు, తాగునీరు లాంటి కనీస వసతులను కల్పించాలి. కొన్ని చోట్ల అసంపూర్తిగా మిగిలిన పనులను పూర్తి చేయించాలి. రైతువేదికల్లో ఏఈఓలు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు పంటలను పరిశీలిస్తూ రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాలి.

– శివ కుమార్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్

మహిళలకు ఇబ్బందిగా ఉంది



రైతువేదికల్లో టాయ్‌లెట్లు లేకపోవడంతో మహిళా ఉద్యోగులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు రైతువేదికల్లో ఏఈఓలుగా మహిళలే పని చేస్తున్నారు. ఉన్నతాధికారుల దష్టికి తీసుకువెళ్లి అసంపూర్తి పనులు చేయిస్తాం. వరికి బదులుగా ఆరుతడి పంటలసాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– సంధ్యారాణి, ఏడీఏ నర్సాపూర్

విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ బంద్

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలంటూ బుధవారం ఏబీవీపీ నాయకులు బంద్ నిర్వహించారు. ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులను అదుపు చేయాలని డిమాండ్ చేస్తూ చిన్నశంకరంపేట, నార్సింగి మండల కేంద్రాలతో పాటు శేరిపల్లి, మిర్జాపల్లి గ్రామాలలో పాఠశాలలను బంద్ చేయించారు. హెచ్‌ఎంకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను అందించారు.

కొల్చారం(నర్సాపూర్)లో..

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి సారించాలంటూ ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరి, పోచేందర్, గంగరాజు, సాగర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్)లో..

మండలంలో ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజులను నియంత్రించాలని, ప్రభుత్వం ప్రత్యేక చట్టం తేవాలని కోరారు. కార్యక్రమంలో దినేశ్, రాము, అనిల్, శేషు తదితరులున్నారు.



చిన్నశంకరంపేటలో హెచ్‌ఎంకు వినతి పత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

నర్సాపూర్‌లో..

విద్యను వ్యాపారంగా మార్చిన ప్రయివేటు పాఠశాలలకు వ్యతిరేకంగా ఏబీవీపీ ఇచ్చిన పిలుపు మేరకు మండలంలో పలు పాఠశాలలు మూసి వేశారు.

రేపు చివరి సర్వసభ్య సమావేశం

శివ్వంపేట(నర్సాపూర్): మండల చివరి సర్వసభ్య సమావేశం 28న నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, ఎంపీడీఓ నాగేశ్వర్ గుప్తా తెలిపారు. శుక్రవారం ఉదయం జరపనున్న సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరౌవుతున్నట్లు చెప్పారు. మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం చర్చించనున్నట్టు తెలిపారు. జూలై 4తో ఎంపీటీసీల పదవీకాలం ముగుస్తుండడంతో ప్రజా ప్రతినిధులకు సన్మానం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని ఎంపీడీఓ నాగేశ్వర్ కోరారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



పెద్దశంకరంపేట(మెదక్): రామచంద్రాచారిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దశంకరంపేట(మెదక్): అంకితభావంతో పనిచేస్తేనే ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని మండల నోడల్ అధికారి వెంకటేశం అన్నారు. బుధవారం చీలాపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రామచంద్రచారి పదవీవిరమణ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధ సంఘాల నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. పీజీహెచ్‌ఎంలు రాజేశ్వర్, సుభాష్, వేణుశంకర్, బి.శ్రీనివాస్, మారుతి, సంగమేశ్వర్, గోపి, ప్రసన్న, శ్రీను, ఆనంద్, సుజీత్, రామకృష్ణాగౌడ్, సిద్దిరాములు తదితరులున్నారు.

నర్సాపూర్‌లో..

ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని స్థానిక జెడ్పీ ఉన్నత బాలుర పాఠశాల హెచ్‌ఎం విఠల్ అన్నారు. పలువురు ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, సునీత, పూర్ణచందర్, రాజయ్య బదిలీలు, పదోన్నతిపై వెళ్లగా వారి స్థానంలో బాలకిషన్, శ్రీకాంత్‌గౌడ్, హేమలత, ఇందిర వచ్చారని హెచ్‌ఎం తెలిపారు. సామ్యానాయక్, వీరేశం, వెంకట్‌రెడ్డి, సుచరిత తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యల తీసుకోవాలి

ఎమ్మార్పీస్ నేత శ్రీనివాస్

నిజాంపేట(మెదక్): దళితుల భూములను ఆక్రమించుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని టీఎస్ జిల్లా అధ్యక్షుడు గర్గుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్యకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని వెంకటాపూర్(కె) గ్రామంలోని 1975 సీలింగ్ యాక్ట్ ప్రకారం దళితులకు ఇవ్వగా ఆక్రమణకు గురవుతోందని, వారు సాగు చేసుకుంటున్న 12ఎకరాల 20గుంటల భూమిని దళిత కుటుంబాలకే కేటాయించాలని డిమాండ్ చేశారు.

పచ్చిరొట్టతో అధిక పోషకాలు

● ఏడీఏ వసంత సుగుణ

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని కల్వకుంటలో బుధవారం పలువురు రైతులకు చెందిన జీలుగ పంటను మండల సహాయ వ్యవసాయశాఖ సంచాలకురాలు వసంత సుగుణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చిరొట్ట పంటలను పండించి భూమిలో కలియదున్నడం వల్ల భూమిలో పోషకాలు పెరిగి అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గి రైతులకు ఖర్చులు తగ్గుతాయని చెప్పారు. వివిధ పంటల యజమాన్య పద్ధతులను గురించి తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణాధికారి శ్రీలత, రైతులు పాల్గొన్నారు.

సూక్ష్మలోపాలు ఉండొద్దు

హవేళిఘణాపూర్(మెదక్): రైతులు తమ నారుమడుల్లో సూక్ష్మలోపాలు లేకుండా నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి నాగమాధురి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఫరీద్‌పూర్ గ్రామంలో బుధవారం ఆమె పొలాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పొలాల్లో పచ్చిరొట్ట, జీలుగ విత్తనాలు చల్లితే మంచి పోషకాలు పెరిగి అధిక దిగుబడి సాధ్యమవుతుందన్నారు. అనంతరం నారుమడులను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు.



కల్వకుంటలో పరిశీలిస్తున్న ఏడీఏ వసంత

నాణ్యమైన భోజనం అందించండి

● ఎంపీపీ స్వరూప

వెల్దుర్తి(తూప్రాన్): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి, కేజీబీవీ పాఠశాల, కళాశాల, బాలుర సంక్షేమ వసతి గృహాన్ని బుధవారం ఎంపీపీ స్వరూప తనిఖీచేశారు. కేజీబీవీ, బీసీ హాస్టల్‌లో మెనూ ప్రకారం భోజనం అందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం ఫలితాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు మెరుగైన ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, నాయకులు మహేశ్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనంతోనే ఆరోగ్యం

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందితేనే ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. మండలంలోని బద్రియతండాలోని పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం తండాలో పర్యటించి, తాగునీటి పథకం ట్యాంక్‌ను పరిశీలించారు. లీకేజీలకు మరమ్మతులు చేయించాలని కార్యదర్శిని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీపీ వినోదరెడ్డి, హెచ్‌ఎం భిక్షపతి పాల్గొన్నారు.



వెల్దుర్తి(తూప్రాన్): భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ

మున్సిపల్ అభివృద్ధే లక్ష్యం



శంకుస్థాపన చేస్తున్న జ్యోతికృష్ణ

తూప్రాన్: మున్సిపల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని మున్సిపల్ చైర్‌పర్సన్ మామిళ్ల జ్యోతికృష్ణ పేర్కొన్నారు. పలు అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మహంకాళి దేవాలయం కాలనీలో సీసీ రోడ్డు, మున్సిపల్ కార్యాలయంలో సోలార్ ప్లేట్లు, బ్రాహ్మణపల్లి సమీపంలో డంపింగ్‌యార్డు నిర్మాణం పనులకు కూడా శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు అన్ని వసతులు కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి, సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి సహకారంతో సమస్యలను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖాజామోహిజొద్దీన్, వైస్ చైర్మన్ నందాలశ్రీనివాస్, కృష్ణ, రవీందర్‌రెడ్డి, రవీందర్‌గుప్త, రఘుపతి, రాజు, నాగరాజుగౌడ్, ఉమర్, అనిల్ పాల్గొన్నారు.



మనోహరాబాద్(తూప్రాన్): విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్‌ఐ



వెల్దుర్తి(తూప్రాన్)లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, పోలీసులు

డ్రగ్స్ వద్దు ఆరోగ్యం ముద్దు

జాతీయ మత్తు, మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు. డ్రగ్స్ వద్దు ఆరోగ్యం ముద్దు అనే నినాదంతో ముందుకు సాగారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని పలువురు పోలీసు అధికారులు అవగాహన కల్పించారు. ముఖ్య కూడళ్లలో మానవహారాలుగా ఏర్పడి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.



హవేళిఘణాపూర్‌లో విద్యార్థినుల ర్యాలీ



చిన్నశంకరంపేటలో..



పెద్దశంకరంపేటలో మాట్లాడుతున్న సీఐ



కాడిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సంక్షిప్త వార్తలు

◆ ఔదార్యం చాటిన కార్మికులు



తూప్రాన్: అనారోగ్యంతో బాధపడుతున్న తోటి కార్మికుడికి బుధవారం టోల్‌ప్లాజా కార్మికులు రూ.67.600 ఆర్థిక సహాయం అందజేసి ఔదార్యం చాటుకున్నారు. వేణు గోపాల్ టోల్ ప్లాజాలో కార్మికుడిగా విధులు నిర్వహించేవాడు. ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. ప్రస్తుతం నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన తోటి కార్మికులు, సిబ్బంది కలిసి ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

◆ ఘనంగా విఠలేశ్వరుని ఉత్సవాలు

రేగోడ్(మెదక్): మండలంలోని మర్పల్లి గ్రామంలోని విఠలేశ్వర ఆలయంలో బుధవారం ఆరాధన ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పూజారి గోపాల్ మహారాజ్ ఆధ్వర్యంలో గ్రామంలో గోపాల కాల్వ ప్రదక్షణ నిర్వహించారు.

◆ ప్రభుత్వం నిర్ణయించిన ధరకే..

శివ్వంపేట(నర్సాపూర్): స్థానిక తైబజార్ నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయించిన ధర వస్తేనే కేటాయింపు జరుగుతుందని అధికారులు తెలిపారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో తైబజార్ కోసం గ్రామ ప్రత్యేక అధికారి, తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, ఎంపీఓ తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమాదేవి ఆధ్వర్యంలో బహిరంగ వేలంపాట నిర్వహించారు. వేలంలో ఏడుగురు పాల్గొనగా రూ.3.21 లక్షలకు వేలం ముగిసింది. అయితే ప్రభుత్వం తొమ్మిది నెలలు తైబజార్ నిర్వహణకు గాను రూ.3.74లక్షలకు ధర నిర్ణయించిందని ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌చారి చెప్పారు. తక్కువ ధర రావడంపై డీఎల్‌పీఓ యాదయ్యకు నివేదించి ఆయన ఆదేశాల ప్రకారం నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు.

◆ యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి చిన్నగొట్టిముక్ల గ్రామ పరిధిలోఉన్న పటేల్ చెరువులో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బుధవారం రాత్రి జేసీబీతో తవ్వకాలు నిర్వహిస్తూ టిప్పర్ల ద్వారా వివిధ ప్రాంతాలను తరలిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారన్నారు. అలాగే బాయన్న చెరువులో సైతం తవ్వకాలకు పాల్పడుతూ గుమ్మడిదల మండల పరిధిలో ఉన్న ఇటుక బట్టీలకు తరలిస్తున్నారని, సంబంధిత ఇరిగేషన్‌శాఖ సిబ్బందికి తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వారు ఆరోపించారు.

◆ మురుగునీరు రాకుండా చూడాలి

శివ్వంపేట(నర్సాపూర్): పంట కాల్వలోకి మురుగు నీరు రాకుండా నియంత్రించాలని గ్రామ రైతులు బుధవారం డిమాండ్ చేశారు. మండల పరిధి గూడూర్ గ్రామానికి చెందిన మురుగునీరు పంట కాల్వలోకి వచ్చే విధంగా తవ్వకాలు చేయడంపై రైతులు రమేశ్‌గౌడ్, వీరేశ్, భూమేశ్, వెంకటేశ్, అజయ్, వేణు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ మురుగు కాల్వను ఇతర మార్గాల ద్వారా మళ్లించాలని గ్రామ ప్రత్యేక అధికారి, తహసీల్దార్ శ్రీనివాస్‌చారికి వినతి పత్రం అందజేశారు.

◆ మైక్రో ఏటీఎంపై అవగాహన

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో ఏపీజీవీబీ బ్యాంక్ మిత్ర ఆధ్వర్యంలో మైక్రో ఏటీఎంపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేనేజర్ మురళీకృష్ణ మాట్లాడుతూ అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, పర్సనల్, యాక్సిడెంట్, హెల్త్ ఇన్సూరెన్స్ లాంటి సేవలు ఇకపై బ్యాంకు మిత్ర ద్వారా పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ భాస్కర్, నిఖిల్, ఐరిక్స్ డిస్ట్రిక్ మేనేజర్ శంకర్, చానల్ మేనేజర్ వెంకటేశ్, రవి, మురళీ, కొండల్ గౌడ్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

◆ కుక్కల దాడితో గేదె మృతి

చిన్నశంకరంపేట(మెదక్): కుక్కలదాడితో గేదె మృతి చెందిన ఘటన మిర్జాపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుర్మ మహిపాల్ తన గేదెను పొలం వద్ద కట్టేశాడు. ఆ గేదెపై కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. నష్టపోయిన తనకు న్యాయం చేయాలని, కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలని రైతు కోరాడు.